ప్రజాశక్తి
మంగళవారం 22 అక్టోబర్ 2024
5
అల్లూరి సీతారామరాజు



నిరుపేదలకు శాలువల పంపిణీ

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని సన్యాసమ్మపాలెం గ్రామంలో వయో వృద్ధులకు, పేదలకు సోమవారం శాలువల పంపిణీ చేశారు. కమ్యూనిస్టు పార్టీ అభిమాని, బీహెచ్‌పీవీ రిటైర్డ్ ఉద్యోగి నిక్కుల పాపారావు, రత్న కుమారి దంపతుల ఆర్థిక సహాయంతో వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండల రావు, సీపీఎం జిల్లా నాయకురాలు హైమావతిలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నిరుపేదలకు శాలువలు పంపిణీ చేయడం అభినందనీయ మన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు అప్పల కొండ పడాల్, కొర్ర అప్పారావు, గన్నేరుపుట్టు మాజీ సర్పంచ్ సూడిపల్లి లక్ష్మీ ప్రమీల పాల్గొన్నారు.



శాలువలు ఇస్తున్న నాయకులు

వాలంటీర్లకు రూ.10వేల వేతనం ఇవ్వాలి

-సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమా మహేశ్వరరావు

ప్రజాశక్తి-పాడేరు: వాలంటీర్లకు బకాయి పడ్డ ఐదు నెలల వేతనం చెల్లించి రాష్ట్ర ప్రభుత్వం హామీ మేరకు నెలకు రూ.10 వేల వేతనం చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమా మహేశ్వరరావు డిమాండ్ చేశారు. పాడేరులో సోమవారం నిర్వహించిన వాలంటీర్ల జిల్లా సదస్సులో ఆయన మాట్లాడుతూ, గ్రామ వార్డు వాలంటీర్లకు బకాయి పడ్డ ఐదు నెలల వేతనం చెల్లించి కూటమి ప్రభుత్వం హామీ మేరకు 10 వేల వేతనం చెల్లించి, విధుల్లోకి తీసుకునే విధంగా రెన్యువల్ చేయాలన్నారు. బలవంతంగా రాజీనామాలు చేయించిన వాలంటర్లు అందర్నీ కొనసాగించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం వాలంటీర్లకు చట్టబద్ధత కల్పించకుండా అన్యాయం చేసిందన్నారు ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన వెంటనే వాలంటర్లను కొనసాగించి పది వేలు వేతనం చెల్లించి వారి సేవలను వినియోగించుకుంటామని మాటిచ్చారని, తక్షణం ఆ హామీ మేరకు అందర్నీ రెన్యువల్ చేసి విధుల్లోకి తీసుకొని 10 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. వీరంతా డిగ్రీ, పీజీలు చేసిన నిరుద్యోగులు ఉన్నారన్నారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగుల సంక్షేమం ధ్యేయమని చెబుతూ 20 లక్షల ఉద్యోగాలు ఇచ్చి నిరుద్యోగ సమస్యను పరిష్కరిస్తామని చెప్తున్నారని, ఉన్న ఉద్యోగాలు తీయకుండా కాపాడాలన్నారు. ఐదు సంవత్సరాలు ప్రభుత్వానికి, ప్రజలకి ఎన్నో సేవలు చేశారని భవిష్యత్తు ఉంటుందని 5000 వేతనంతో పని చేశారని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం వీరి భవిష్యత్తును నాశనం చేయొద్దని ప్రభుత్వం



మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

విజ్ఞప్తి చేశారు. సిఐటియు అండగా ఉంటుందని వీరి పోరాటానికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు.

సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ, పోరాడి వాలంటీర్లు ప్రభుత్వ హామీని సాధించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం వాలంటీర్లకు న్యాయం చేయకపోతే సిఐటియు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. వాలంటీర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ధర్మానపడాల్, సిఐటియు జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్.సుందర్రావు, వాలంటీర్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కొండబాబు, శోభన్, ప్రసన్న కుమార్, దేవా, తాతబాబు, చిన్నయ్య, సురేష్, విజయ్, పెద్ద సంఖ్యలో వాలంటీర్లు హాజరయ్యారు.

ఘనంగా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం



నివాళి అర్పిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు:- ఏజెన్సీలోని శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ యంత్రాంగం అందిస్తున్న సేవలు అపూర్వమని, అల్లూరి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఉద్ఘాటించారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాలను స్థానిక తలారసింగి ఆశ్రమ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరుల స్థూపానికి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ పుష్పగుచ్ఛాలతో శ్రద్ధాంజలి ఘటించి నివాళులు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విధి నిర్వహణలో అనేకమంది పోలీసు అమరవీరులు అందించిన త్యాగాలు మరువలేనివని కొనియాడుతూ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఏఎస్పీలు, పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్లు, సబ్ ఇన్స్పెక్టర్లు, సి ఆర్ పి ఎఫ్ పోలీస్ యంత్రాంగం తదితరులు లు హాజరయ్యారు.

జిమాడుగుల పోలీసుల అమరవీరుల సంస్మరణ కార్యక్రమాన్ని స్థానిక పోలీస్ స్టేషన్లో సీఐ సిహెచ్, వెంకట్రావు, ఎస్సై షణ్ముఖరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమరవీరుల సేవలను కొనియాడారు ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రంపచోడవరం: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా స్థానిక పోలీస్ స్టేషన్ నుండి అంబేద్కర్ సెంటర్ మీదుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు రంపచోడవరం సిఐ రవికుమార్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ రవికుమార్ మాట్లాడుతూ నిత్యం శాంతిభద్రతలు కాపాడే విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన అమరవీరులను స్మరించుకుంటూ అమరవీరుల దినోత్సవం నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై షాదిక్, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రజలు పాల్గొన్నారు.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో పోలీస్ అమరవీరుల వారోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అమరులైన జవాన్ల చిత్రపటాలకు సీలేరు ఎస్సై రామకృష్ణ, సిఆర్పిఎఫ్ 42జి బెటాలియన్ ఇన్స్పెక్టర్ వికాస్ పాండే, సివిల్, సిఆర్‌పిఎఫ్ పోలీస్ సిబ్బంది పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం అమరవీరుల చిత్రపటాల ప్లే కార్డులను చేతపట్టి పోలీస్ స్టేషన్ నుంచి మెయిన్ రోడ్డుకు ర్యాలీ నిర్వహించారు. మార్కెట్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. అమరవీరుల త్యాగాలు వృధాగా పోవు అంటూ నినాదాలు చేశారు.



రంపచోడవరంలో ర్యాలీ చేపడుతున్న పోలీసులు, విద్యార్థులు



బంగారు పతకం సాధించిన క్రీడాకారిణి

రాష్ట్ర స్థాయి కరాటే పోటీలో
సత్తా చాటిన గిరిజన మహిళ

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని మఠం పంచాయతీ మఠం జాకరవలస గ్రామానికి చెందిన కొర్రా. చంద్రకళ తునిలో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీలో బంగారు పతకాన్ని గెలుచుకుంది. 2011-12 సంవత్సరంలో నర్సీపట్నంలో స్టేట్ లెవెల్‌లో జరిగిన కరాటే శిక్షణలో ఆమె పాల్గొని శిక్షణ పొందారు. ఆమెకు ముగ్గురు బాబులు, ఒక కుమార్తె ఉన్నారు. తన భర్త చనిపోవడంతో కుటుంబ భారం పెరిగి పోయింది. దీంతో కరాటే కళగా మిగిలిపోయింది. సిపిఎం, గిరిజన సంఘం, సిఐటియు నాయకులు శారదా నికేతన్ స్కూల్ ఫౌండర్ చైర్మన్ వెంగడ తిరుపతిరావు ద్వారా అరకు వాలీ శారద నికేషన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో" కరాటే స్పోర్ట్ కోటా"లో ఆమెను ఉద్యోగం అవకాశం కల్పించడంతో. ఆర్థికంగా కొంత నిలదొక్కుని ఆమె కలను మరల ప్రారంభించింది. ఈనెల 20 తేదీన తునిలో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీలో పాల్గొని 55 కేజీల కేటగిరి కరాటే విభాగంలో గోల్డ్ మోడల్ సాధించింది.



మాట్లాడుతున్న ఎంపిడిఒ

గ్రామాల్లో శానిటేషన్‌పై దృష్టి

ప్రజాశక్తి- అరకులోయ: గ్రామాల్లో శానిటేషన్ మెరుగుదలకు ప్రత్యేక దృష్టి సారించాలని అరకులోయ ఎంపీడీవో లవ రాజు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీర్ విద్యాశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, ఐసిడిఎస్, సచివాలయ సిబ్బందిలతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మండల అభివృద్ధిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి 15 రోజులకు ఒకసారి వాటర్ ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలన్నారు. గ్రామాల్లోని గిరిజనులు తాగునీటికి ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రధానమంత్రి జన్ మన్, ఇతర ఇళ్ల నిర్మాణ పనులు వెంట వెంటనే పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలల్లో మిడ్డే మీల్స్ సక్రమంగా అమలు జరిగేలా చిన్నారులకు పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ త్రినాధరావు, సిడిపిఓ శారద, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రేఖపల్లి గ్రామ మహిళలు

జనావాసాల మధ్య మద్యం దుకాణం వద్దు

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలో రేఖపల్లి పంచాయతీ పరిధి రేఖపల్లి గ్రామం మధ్యలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడం సరికాదని స్థానిక మహిళలు పేర్కొన్నారు. సోమవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ రేఖపల్లి గ్రామంలో జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం దుకాణానికి 20 అడుగుల దూరంలో సాయిబాబా గుడి , దాని వెనుక భాగంలో క్రైస్తవ ప్రార్థనా మందిరం, 30 అడుగుల దూరంలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఉన్నాయని తెలిపారు. ఈ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటును స్థానిక మహిళలు, చుట్టుపక్కల నివాసాలవాళ్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా అదే ప్రదేశంలో మద్యం దుకాణాన్ని ప్రారంభించడం దారుణమన్నారు. ఈ మద్యం షాపును తక్షణమే అక్కడ నుండి తొలగించి ఊరికి శివారు ప్రాంతంలో ఏర్పాటు చేసుకోవాలని డిమాండ్ చేశారు. వంద పడకలు ఉంటేనే అది ఆసుపత్రి అని లేకపోతే అది ఆసుపత్రి కాదని మండల తహశీల్దారు అనడం విడ్డూరంగా ఉందన్నారు. పోలీసు అధికారులు, మండల అధికారులు మద్యం వ్యాపారులకు తొత్తుగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. తక్షణమే జనావాసాల మధ్య నుండి మద్యం దుకాణం తీయకపోతే ఐటిడిఏ పిఒకి, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు.



అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

ప్రజాశక్తి-రంపచోడవరం

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటిడిఎ సమావేశ మందిరంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సబ్ కలెక్టర్ నిర్వహించారు. దీనికి ఏజెన్సీ 7 మండలాల నుండి పలు సమస్యలపై ప్రజలు 57 అర్జీలు అందించారు. కార్యక్రమంలో ఐటిడిఎ ఏపీఓ జనరల్ డిఎన్వి రమణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జాన్ రాజ్, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, వెలుగు ఏపిడి దేగలయ్య, డీఈవో వై.మల్లేశ్వరరావు, డాక్టర్ వెంకట ఇందిరా, డిఎల్‌డిఓ కె.కోటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రవికుమార్,సుబ్బయ్య, తహశీల్దారు ఏఎస్వి సత్యనారాయణ, ఎంపీడీవో యస్.శ్రీనివాసరావు, సిడిపిఓ సంధ్యారాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.



వారపు సంతలో కూరగాయలు విక్రయిస్తున్న దృశ్యం

కొండెక్కిన కూరగాయల ధరలు

ప్రజాశక్తి-వై.రామవరం

వై.రామవరం మండల కేంద్రంలో సోమవారం వారపు సంతలో కూరగాయల ధరలు కొండెక్కాయి. టమాట కిలో రూ.100, కాలీఫ్లవర్ రూ.100, బెండకాయలు రూ.80, బీరకాయలు రూ.60, చిక్కుళ్ళు రూ.100, ఆకాకరకాయలు రూ.120, పచ్చిమిర్చి కిలో రూ.100 ఇలా అన్ని రకాల కూరగాయలు ధరలు భారీగా పెరిగాయి. దీంతో వాటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు వెనకాడారు. ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యాంగా అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ప్రతి ఇంట్లో నిత్యవసరమైన ఉల్లిపాయల ధర గత రెండు నెలల నుండి తగ్గకపోవడంతో సామాన్యులు వాటికి కొనడానికి అనేక ఇబ్బందులు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కూరగాయలు, నిత్యవసర సరుకులు ధరలను నియంత్రించే విధంగా చర్యలు చేపట్టాలని వినియోగదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

గ్రామాల్లో వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని చీడిపాలెం, బూసులపాలెం గ్రామాల్లో సోమవారం లాగరాయి పీహెచ్సీ వైద్యులు నాగార్జున ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాలు నిర్వహించారు. వైద్య అధికారి ఎం నాగార్జున వివిధ రుగ్మతలతో బాధపడుతున్న సుమారు 50 మందిక రోగులకు వైద్య పరీక్ష నిర్వహించి ఉచితంగా మందులు అందచేశారు. సీజనల్ వ్యాధులు పట్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పి సుష్మ, సోమినాయుడు,104 డిఈఓ శ్రీనివాస్, పైలెట్ కనకరాజు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ నాగార్జున

సదరం వెబ్ సైట్‌లో అల్లూరి జిల్లా పేరును చేర్చాలి

ప్రజాశక్తి-అరకు లోయ : పాడేరు డివిజన్ పరిధిలో విభిన్న ప్రతిభవంతులకు (వికలాంగులకు)సదరం శిబిరం తక్షణమే ఏర్పాటు చేయాలని సదరం వెబ్ సైట్ లో అల్లూరి జిల్లా పేరును చేర్చాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్, జిల్లా ఉపాధ్యక్షులు జి బుజ్జి బాబు లు డిమాండ్ చేశారు. అరకువేలి గిరిజన సంఘం భవనంలో చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు జిల్లా లో విభిన్న ప్రతిభావంతులు (వికలాంగులు) అరకు ఏరియా ఆసుపత్రి లో 290, పాడేరు జిల్లా ఆసుపత్రి లో 240 మంది స్లాట్ బుకింగ్ చేసుకున్నారని తెలిపారు. ప్రభుత్వ అధికారిక వికలాంగుల వెబ్ సైట్ లో అల్లూరి సీతారామరాజు జిల్లా పేరు లేకపోవడంతో సదరం జాబితాలోవున్నా 530 మంది దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని తక్షణమే సదరం వెబ్ సైట్ సమస్య పరిష్కరించి స్లాట్ బుకింగ్ చేసుకున్నా విభిన్న ప్రతిభావంతులకు న్యాయం చేయాలని లేని పక్షంలో దివ్యాంగులతో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు బాలరాజు, మార్కండ్ పాల్గొన్నారు.

ఆధార్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలి

గ్రామ/వార్డు సచివాలయాల జిల్లా నోడల్ అధికారి కుమార్

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని గ్రామ/ వార్డు/ సచివాలయాల జిల్లా నోడల్ అధికారి పీఎస్ కుమార్ సూచించారు. సోమవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ, ప్రజలకు గుర్తింపు కార్డుగా మాత్రమే కాకుండా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే ప్రయోజనాల్ని అందుకునేందుకు ప్రాతిపదికగా వున్న ఆధార్ కార్డులలో తప్పులు లేకుండా సరిచూసుకుని - నవీకరించు కోవడానికి ఆధార్ కార్డు బయోమెట్రిక్ అప్‌డేట్ తప్పనిసరి అని చెప్పారు. ఈ మేరకు జిల్లా వాసులకు వెసులు బాటు కల్పించడానికి జిల్లా కలెక్టర్ వారి ఆదేశం మేరకు ఈనెల 22. నుండి. 25. వరకూ నాలుగు రోజులపాటు జిల్లావ్యాప్తంగా 44 కేంద్రాలలో ప్రత్యేక ఆధార్ క్యాంప్ లు ఏర్పాటు చేసినట్లు తెలియచేసారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఐదు నుండి పదిహేను సంవత్సరాల మధ్యలో వున్నవారు 69482 మంది, 15 నుండి 17 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న వారు 72972 మంది, 18 సంవత్సరాల పైబడినవారు 142454 మంది ఇంకనూ వారి ఆధార్ కార్డులు బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించుకోవాల్సి ఉందని తెలిపారు. ఈ మేరకు పైన తెలిపిన విధంగా ఆయా తేదీల్లో అవసరమైన వారు ఆధార్ అప్డేట్ చేసుకోవాలని అలాగే ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు ఆధార్ కార్డు కోసం నూతనంగా నమోదు చేసుకోవచ్చని తెలియచేసారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

డిఎఫ్ఒగా పివిఎస్ రెడ్డి నియామకం..

ప్రజాశక్తి -పాడేరు: పాడేరు అటవీ శాఖ డి ఎఫ్ ఓ డిఎఫ్ఓగా పోతంశెట్టి వెంకట సందీప్ రెడ్డి నియమితులయ్యారు. ఈయన కడప జిల్లా నుంచి పాడేరు అటవీ శాఖ డివిజన్ కు బదిలీపై వచ్చారు. ఈ మేరకు ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు అరకు సబ్ డి ఎఫ్ కే ఉమామహేశ్వరి, అటవీ శాఖ కార్యాలయ సిబ్బంది పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న డీఎఫ్ఓ పుట్టపర్తి బదిలీపై వెళ్లారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న డిఎఫ్ఓ

జి.కొత్తూరులో మరో పసిబిడ్డ మృత్యువాత

వైద్యులు అందుబాటులో లేకపోవడంతోనే మరణాలు : సర్పంచ్, బాధిత తల్లిదండ్రులు

ప్రజాశక్తి-వై.రామవరం

వై.రామవరం మండలం గుర్తేడు పంచాయతీ పరిధి జి.కొత్తూరులో ఇటీవల నాలుగు నెలలు పసిబిడ్డ మృతి చెందిన సంఘటన మరువక ముందే అదే గ్రామానికి చెందిన మూడు నెలలు పసికందు మృత్యువాతకు గురైన సంఘటన తీవ్ర కలకలం రేపింది. వైద్యులు అందుబాటులో లేకపోవడంతోనే పసిబిడ్డలు మృతి చెందినట్లు ఆ పంచాయతీ సర్పంచ్ దుష్యంత్, బాధిత తల్లిదండ్రులు ఆరోపించారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ప్రకారం... జి.కొత్తూరు గ్రామానికి చెందిన కడబాల లింగారెడ్డి కడబాల కళ్యాణి దంపతులకు చెందిన మూడు నెలల బాబు ఆరోగ్య పరిస్థితి బాగు లేకపోవడంతో ఆదివారం గుర్తేడు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యాధికారులు అందుబాటులో లేకపోవడంతో స్టాఫ్ నర్సు తనకు తెలిసిన వైద్యం అందించి పంపించేశారు. చిన్నారి ఆరోగ్య పరిస్థితి విషమిస్తుండడంతో తల్లిదండ్రులు రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లారు. మెరుగైన వైద్య సేవలు నిమిత్తం ఏరియా ఆసుపత్రి వైద్యులు రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి రిఫర్ చేశారు. రాజమండ్రిలో చిన్నారికి వైద్య పరీక్షలు అనంతరం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి తరలించి వైద్యం అందించారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉండడంతో పరిస్థితి విషమించి ఆదివారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో పసిబిడ్డ మృతి చెందింది. గుర్తేడు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాధికారులు అందుబాటులో లేకపోవడంతో సకాలంలో వైద్య సేవలు అందకపోవడంతోనే బాబు మృతి చెందినట్లు బాధిత తల్లిదండ్రులు బోరును విలపించారు.

గుర్తేడు వైద్యాధికారులను బదిలీ చేయాలి : సర్పంచ్

గుర్తేడు ప్రభుత్వాసుపత్రిలో అందుబాటు లేని వైద్య అధికారులను తక్షణమే బదిలీ చేయాలని సర్పంచ్ దుష్యంత్ రంపచోడవరం ఐటిడిఎ పీవోకి విజ్ఞప్తి చేశారు.



ఆసుపత్రిలో పసికందు మృతదేహం

వైద్యాధికారులు విధి నిర్వహణలో అలసత్వం వ్యవహరించడం వలనే సకాలంలో వైద్యం అందక నాలుగు రోజులు వ్యాధిలో ఇద్దరు చిన్నారులు మృతి చెందినట్లు ఆరోపించారు. పసిబిడ్డల మృత్యువాతపై సమగ్రమైన విచారం జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఎఎస్‌డిఎస్ ఆధ్వర్యాన నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-విఆర్.పురం

స్థానిక ఎఎస్‌డిఎస్ సంస్థ ఆధ్వర్యంలో విఆర్.పురం మండలం, బిసి కాలనీకి చెందిన 81 కుటుంబాలకు సోమవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి రూ.1200 విలువైన పది కేజీల బియ్యం, మూడు కేజీల కందిపప్పు, బెడ్ షీట్స్, టవల్స్, దుప్పట్లతో ఒక కిట్‌గా ఏర్పాటు చేసి 81 కిట్లను తహసీల్దారు సరస్వతి, ఎంపిడిఓ శశిభూషణం చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎఎస్‌డిఎస్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు గాంధీబాబు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో వరదల సమయంలో జీవనోపాధి లేకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వరదలు తగ్గిన తర్వాత సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని, కాలనీ వాసులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌డిఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



నిత్యావసరాలు అందించిన ఎఎస్‌డిఎస్ సంస్థ ప్రతినిధులు

వీధి లైట్లు ఏర్పాటు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-కూనవరం : మండలంలోని టేకుల బోరు నుండి కూనవరం టౌన్ వరకు వీధిలైట్లు ఏర్పాటు చేయాలని సోమవారం జరిగిన సిపిఎం కూనవరం శాఖ మహాసభ డిమాండ్ చేసింది. గోదావరి వరదలు మూడుసార్లు రావడంతో కూనవరం గ్రామంలో వ్యాపారులు, ప్రజలు తీవ్రంగా నష్టపోయారని, ప్రభుత్వం ఇచ్చిన వరద సహాయం డబ్బులు రూ.4800 కొంతమందికే అందాయని, నిజంగా నష్టపోయిన వారికి సహాయం అందించలేదని, తక్షణమే వారికి ఆర్థిక సహాయం అందించాలని మహాసభ కోరింది. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, నాయకులు గడ్డిపాటి షణ్ముకేశ్వరావు, తలగాని నాగరాజు, తాళ్లూరి శ్రీనివాసరావు, నోముల సత్యనారాయణ, కొండా ఈశ్వర్లు, సుధారాణి, తాళ్లూరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఐటిడిఎ పాలకవర్గ సమావేశాలు నిర్వహించాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నేతలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: రాష్ట్ర వ్యాప్తంగానున్న ఐటీడీఏల్లో వెంటనే పాలకవర్గ సమావేశాలు నిర్వహించి అందులో జీవో 3 పై చర్చ చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు పి.చిన్నస్వామి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్చించేందుకుగాను ప్రతి మూడు నెలలకోసారి ఐటీడీఏ పాలక వర్గ సమావేశం నిర్వహించాల్సి ఉందన్నారు. సంవత్సరాలు గడుస్తున్నా పాలకవర్గ సమావేశాలు నిర్వహించ లేదన్నారు. ప్రస్తుతం ప్రధానంగా జీవో 3కు చట్టబద్ధత కల్పించే విధంగా పాలకవర్గ సమావేశంలో చర్చించి ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని కోరారు. గిరిజన ప్రాంతంలో 1/70 భూ బదలైంపు చట్టానికి వ్యతిరేకంగా గిరిజన నేతలు నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ టి సోమేశ్వరరావు, గాసన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందిని పంచాయతీలకు అప్పగించండి

ప్రజాశక్తి- అరకులోయ:సచివాలయ సిబ్బందిని పంచాయతీలకు అనుసంధానం చేయాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షులు బొర్ర నాగరాజు ఆధ్వర్యంలో జిల్లా సర్పంచులు కలెక్టర్ దినేష్ కుమార్ కు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు, పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు మాట్లాడుతూ, పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం కోసం ప్రభుత్వాలు పని చేయాలన్నారు.గత వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను పక్కనపెట్టి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చిందని సంపూర్ణ నిర్మాణాలు చేపట్లేదని ఆవేధన వ్యక్తం చేశారు. సచివాలయంలో పనిచేసే సిబ్బందిని ఎవరు పర్యవేక్షించాలో తెలియక అయోమయ పరిస్థితిలో గ్రామ సచివాలయ వ్యవస్థ నడుస్తుందన్నారు. దీంతో గ్రామ పంచాయతీ రాజ్ వ్యవస్థ నిర్వీర్యం అయిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు బాకూరు వెంకటరమణ, పాండురంగస్వామి, నాయుడు, రంజిత్ కుమార్, శాంతకుమారి, సత్యనారాయణ, కొట్టగుల్లి ఉషారాణి, శ్రీలక్ష్మి, పార్వతమ్మ పాల్గొన్నారు.

డుంబ్రిగుడ:గ్రామ పంచాయితీలను సచివాలయాలుగా మార్చి సచివాలయంలో పని చేస్తున్న సిబ్బందిని పంచాయతీలకు అప్పగించాలని మండలంలోని కొర్రాయి పంచాయితీ సర్పంచ్ పి కొములు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాణిక్యం

ప్రజా ఉద్యమాల్లో గద్దర్ పాత్ర కీలకం

ప్రజాశక్తి -జి.మాడుగుల: ఆంధ్ర యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన గద్దర్ సంస్మరణ కార్యక్రమంలో అల్లూరి జిల్లా దండకారణ్య ఉద్యోగ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు సమరెడ్డి మాణిక్యం పాల్గొని ప్రసంగించారు. గద్దర్ అల్లూరి జిల్లా ఏజెన్సీలో ప్రజా ఉద్యమాల్లో అప్పట్లో కీలక పాత్ర పోషించారన్నారు. ఏజెన్సీ లో 100శాతం ఉద్యోగాలు ఆదివాసీల కు కేటాయించాలని ఉద్యమం చేసిన ఘనత ఆయనదే అని కొనియాడారు ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

అన్నసమారాధన



షిర్డీసాయి ఆలయంలో అన్న సంతర్పణలో పాల్గొన్న భక్తులు

ప్రజాశక్తి-దేవీపట్నం :మండలంలోని ఇందుకూరు, ఇందుకూరుపేట మధ్య సువర్ణగిరి షిరిడి సాయిబాబా ఆలయంలో తొమ్మిది రోజులు సాయి నవరాత్రులు ఉత్సవాల్లో చివరి రోజు సోమవారం భారీ అన్న సంతర్పణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో సుమారు 2000 మంది భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో శ్రీసువర్ణగిరి శిరిడి సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఐటి హిల్స్‌కు ఆర్‌టిసి బస్ సర్వీసులు

ప్రజాశక్తి-మధురవాడ: నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ఐటి హిల్స్‌కు కొత్తగా ఏర్పాటు చేసిన ఆర్‌టిసి బస్ సర్వీసులను సోమవారం ఎంపీ ఎం.శ్రీభరత్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఐటి ఉద్యోగులకు అందుబాటులో ఉండేలా మధురవాడ మీదుగా పాత గాజువాక, కూర్మన్నపాలెం, విజయనగరం, పెందుర్తి నుండి నాలుగు ఆర్‌టిసి ప్రత్యేక బస్సు సర్వీసులను ప్రారంభించారు. ఆయా బస్సులు ప్రతీ పనిదినాల్లో ఆయా ప్రదేశాల నుంచి ఉదయం 8గంటలకు బయలుదేరి ఐటి హిల్స్ చేరుకుంటాయని, సాయంత్రం 5:40 నుండి 5:50 గంటల మధ్యలో మధురవాడ ఐటి హిల్స్ నుంచి బయలు దేరి ఆయా ప్రాంతాలకు చేరుకుంటాయన్నారు. ఐటి ఉద్యోగులకు ప్రభుత్వ సహకారంతో ఉచితంగా ఈ బస్ సర్వీసులను నడుపుతున్నట్లు వెల్లడించారు వీటితో పాటు విశాఖపట్నం సిటీ నుండి రెండు బస్సులను అదనంగా ఐటి. హిల్స్‌కు ప్రయాణికుల సౌకర్యార్థం నడుపుతున్నట్లు తెలిపారు. గాజువాక నుండి ఉదయం 07:40గంటలకు, మధ్యాహ్నం 03:40 గంటలకు అలాగే ద్వారకా బస్సు స్టేషన్ల నుంచి ఉదయం 05:40, 08:00, మధ్యాహ్నం 2:05 గంటలకు, అలాగే ఐ.టి. హెల్స్ నుంచి ఉదయం 6:30, 8:50, 09:00, మధ్యాహ్నం 3:00 సాయంత్రం 5:40 గంటలకు ఈ బస్సులు బయలుదేరుతాయన్నారు. కార్యక్రమంలో ఇంచార్జి జిల్లా ప్రజా రవాణా అధికారి బి. అప్పలనాయుడు, జి.సత్యనారాయణ, డిప్యూటీ సిటిఎం. ఇతర ఆర్‌టిసి సిబ్బంది ఐటి. హిల్స్ అధికారులు పాల్గొన్నారు.

నేడు విమ్స్‌లో రొమ్ము కేన్సర్‌పై వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఆరిలోవ : రొమ్ము కేన్సర్ అవగాహన మాసోత్సవాలను పురస్కరించుకొని విశాఖ విమ్స్‌లో మంగళవారం రొమ్ము కేన్సర్‌పై వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె. రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో రొమ్ము కేన్సర్ నిర్ధారణ వైద్య పరీక్షలను ఉచితంగా చేస్తామన్నారు. అవసరమైన బ్రెస్ట్ ఆల్ట్రా సౌండ్, బయాప్సీ తదితర వైద్య పరీక్షలను ఉచితంగా చేయడంతోపాటు మందులను కూడా ఉచితంగా అందజేస్తామన్నారు.. విమ్స్ ఆస్పత్రి ఒపి బ్లాక్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు రొమ్ము కేస్సర్‌పై ఉచిత వైద్యశిబిరొ కొనసాగుతుందని,ప్రజలు ఈ సదవకాశాన్ని వినియోగించుకొని, కేన్సర్‌పై తమకున్న అపోహలను నివృత్తి చేసుకోవాలన్నారు. .

ఆదర్శ విద్యార్థుల పరిశ్రమల సందర్శన

ప్రజాశక్తి-పెందుర్తి:: స్థానిక ఆదర్శ డిగ్రీ కళాశాల బిబిఎ విద్యార్థులు కో కరికులర్ యాక్టివిటీలో భాగంగా చోడవరం కోఆపరేటివ్ సుగర్స్, ఆపిల్ ఇంటీరియర్స్ పరిశ్రమలను సోమవారం సందర్శించారు. మేనేజ్‌మెంట్ విభాగం లెక్చరర్ బిఆర్.పరిమళ ఆధ్వర్యంలో 20మది బిబిఎ విద్యార్థులు ఆయా పరిశ్రమలను సందర్శించారని ప్రిన్సిపల్ ఎన్ఇ.ఫ్లోరా తెలిపారు. ఆయా కంపెనీల్లోని ప్రొడక్షన్, డిజైనింగ్, మాన్యుఫ్యాక్చరింగ్ విభాగాల సందర్శన ద్వారా ఆయా పరిశ్రమల పనితీరుపై ప్రాక్టికల్ అనుభవం కలుగుతుందని, తద్వారా విద్యార్థులకు భవిష్యత్‌లో ఉపయోగపడుతుందని కంప్యూటర్ విభాగం లెక్చరర్ డిఎస్.ప్రదీప్ తెలిపారు.

మన్యంలో భారీ వర్షం



పాడేరులో ప్రవహిస్తున్న వర్షపు నీరు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ కాసింది. మధ్యాహ్నం మూడు గంటల తర్వాత కుంభవృష్టిగా వాన కురిసింది. ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని భారీ వర్షం పడడంతో జనజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. పట్టణంలో వీధులన్నీ తడిసి ముద్దయ్యాయి. తొలుత కారు మబ్బులు కమ్ము కోవడంతో చీకటి వాతావరణం ఏర్పడింది. ఆకాశం పూర్తిగా మేఘావృతమై వర్షం మొదలైంది. మధ్యాహ్నం మూడు గంటలకు మొదలైన వాన 5 గంటల వరకు కురుస్తూనే ఉంది. వర్షంతో సాయంత్రం ఆఫీసుల నుంచి వెళ్లే ఉద్యోగులు, కళాశాలల, పాఠశాలల నుంచి విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణాలు సాగించారు. వర్షంతో రోడ్లన్నీ చిత్తడిగా మారడంతో పాటు పంట పొలాల్లోని వర్షం నీరు వచ్చి చేరింది. గంటకు పైగా ఏకధాటిగా కురిసిన వర్షానికి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. పాడేరు పట్టణంలో డ్రైనేజీలు పొంగి రోడ్లపై భారీగా మురుగునీరు ప్రవహించింది.

ముంచింగిపుట్టు: మండలంలో సోమవారం రెండు గంటలు తర్వాత భారీ వర్షం కురిసింది. పొలాల్లో వర్షపు నీరు చేరింది. సామలు, రాగులు, ఇతర చిరుధాన్యాల పంటలు చేతికందొచ్చే సమయానికి వర్షాలు కురవడంతో తీవ్ర నష్ట పోతున్నామని మండలంలోని గిరిజన వ్యవసాయదారులు ఆవేదన చెందుతున్నారు.

నాంది నిర్మాణాలు పరిశీలన



పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి- హుకుంపేట:- మండలంలోని మెరక చింత పంచాయితీ, మెరకచింతలో నాంది ఫౌండేషన్ నిర్మిస్తున్న భవనాలను స్థానిక ప్రజలతో కలిసి, మండల ప్రజా ప్రతినిధులు సోమవారం పరిశీలించారు. ఏజెన్సీలో నిర్మాణాలు చేపట్టాలంటే, పీసా, గ్రామ సభ తీర్మానాలు అనుమతిలతో పాటుపంచాయితీ రాజ్ చట్టం ప్రకారం, పంచాయితీ అప్రూవల్ తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని స్థానిక నాయకులు, వైస్ ఎంపీపీ సుడిపల్లి కొండలరావు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ, గ్రామంలో ఎవరి అనుమతులు లేకుండా నే శాశ్వత నిర్మణాలు నాంది ఫౌండేషన్ చేపట్టడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. చాటుమాటుగా అనుమతులు పొందకుండా పనులు ప్రారంభించడంపై అనుమానం వ్యక్తం చేశారు. నాంది ఫౌండేషన్ ఏర్పాటు తో గిరిజన కాఫీ రైతులకు, గిరిజన యువతకు ఉద్యోగాలు కల్పనతో మేలు జరిగినా గిరిజన చట్టాలను పాటించాలన్నారు. ఈ కార్యక్రమం లో మెరకచింత మాజీ సర్పంచ్, సీపీఎం మండల కార్యదర్శి వలసనైని లక్ష్మణ్‌రావు, టిడిపి అరకు నియోజకవర్గం ఎస్‌టి సెల్ అధికార ప్రతినిధి పట్టేబోయిన శంకర్ నాయుడు, టీడీపీ అరకు పార్లమెంట్ అధ్యక్షుడు తామర్ల సుబ్బారావు, మండల నాయకులు వలసనైని బాలన్న, వైస్ సర్పంచ్ నైని బొంజుబాబు, మాజీ సర్పంచ్ పూజారి రమణబాబు, వార్డు సభ్యులు వలసనైని సింహాచలం, రైతులు గెమ్మెలి ఈశ్వర్ రావు, బాకూరు సత్య నారాయణరాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బోయ/వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చవద్దు

ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ డిమాండ్

ప్రజాశక్తి-పాడేరు:అనంతపురంలో జరిగిన వాల్మీకి మహర్షి జయంతి సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి బోయ వాల్మీకి లను కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానం ప్రకారం గిరిజన జాబితాలో చేర్చడానికి అసెంబ్లీలో తీర్మానం ఆమోదించి కేంద్రానికి పంపుతామని చెప్పడాన్ని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మన్న పడాల్ తీవ్రంగా ఖండించారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం బోయ, వాల్మికీలను గిరిజన జాబితాలో చెర్చే ప్రయత్నాన్ని విరమించు కోవాలని డిమాండ్ చేశారు. బోయ వాల్మికీలను గిరిజన జాబితాలో చేర్చితే ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 28 లక్షల మంది ఆదివాసీల ఆగ్రహం చవిచూడాల్సి న పరిస్థితి ఏర్పడుతుందని . హెచ్చరించారు. మంత్రి స్టేట్ మెంట్ పై కూటమి ప్రభుత్వంలోని గిరిజన సంక్షేమ మంత్రి, గిరిజన ఎంపి, ఏంఎల్ ఏ ల వైఖరి ఏమిటో ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలో వచ్చి 4 నెలలు గడిచినా ఆదివాసులకు ఇచ్చిన హామీ జివో 3 చట్టబద్ధత కల్పించ లేదన్నారు. ట్రైబల్ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల కోసం అతీగతీ లేదన్నారు. ఈ సమావేశంలో ఆదివాసి గిరిజన సంఘం పాడేరు మండల అధ్యక్ష కార్యదర్శులు సత్యనారాయణ, చిట్టిబాబు పాల్గొన్నారు.

17 నెలల వేతన బకాయి చెల్లించాలి

ప్రజాశక్తి-దేవీపట్నం : శ్రీసత్యసాయి మంచినీటి పథకంలో పని చేస్తున్న కార్మికులకు 17 నెలలుగా బకాయి ఉన్న జీతాలు చెల్లింపునకు ఆ శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కొంత కాలంగా ఇందుకూరుపేట నుండి గోకవరం మధ్యలో పైప్ లైన్ లీకులు ఎక్కువగా ఉండడంతో ఎగువ ప్రాంతానికి తాగునీరు సరిగ్గా వెళ్లడం లేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో తమకు జీతాలు చెల్లించకపోయినా సత్యసాయి తాగునీటి పథకం సిబ్బంది ఎండను సైతం లెక్కచేయకుండా లీకేజీలను అరికట్టే పనులు చేపట్టారు. 17 నెలలుగా జీతాలు లేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నా వాటిని పక్కన పెట్టి ప్రజల తాగునీటి కోసం పైప్ లైన్ లీకులు సరి చేస్తున్న కార్మికుల పట్ల సంబంధిత శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ మానవతా దృక్పథంతో స్పందించి వారికి జీతాలను త్వరగా ఇప్పించాలని ప్రజలు కోరుతున్నారు.



తాగునీరు లీకేజీని అరికట్టే పనులు చేస్తున్న సత్యసాయి కార్మికులు

4వ తరగతి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



డిడికి వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నేతలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి రంపచోడవరం ఐటిడిఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహలలో పనిచేస్తున్న 4వ తరగతి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘం నాయకులు రంపచోడవరం గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతికి సోమవారం వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుండి నుంచి కట్టెల పొయ్యి మీదే విద్యార్థులకు వంట చేస్తున్నామని, గ్యాస్ సరఫరా చేయాలని కోరారు. సిబ్బందికి యూనిఫారం ఇవ్వాలని, పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని డిడి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు యస్.రామన్నదొర, ఆర్.శివకుమార్, పి.చిన్నారెడ్డి, పి.నాగేశ్వరరావు, డి.తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ కార్మికుల ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకుందాం

ప్రజాశక్తి -ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ కార్మికుల ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకుందామని స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి అన్నారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులపై జరుగుతున్న ఆర్థిక దాడిని నిరసిస్తూ సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ అడ్మిన్ బిల్డింగ్ వద్ద నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ కార్మికులు ఉంటేనే పరిశ్రమ ఉందని, అలాంటి కార్మిక వర్గాన్ని అణగదొక్కాలని చూస్తున్న కేంద్రప్రభుత్వ చర్యలను తిప్పికొడతామన్నారు. హెచ్‌ఆర్‌ఎ తొలగింపు, విద్యుత్ ఛార్జీల పెంపు, ఇఎల్ ఎన్‌క్యాష్‌మెంట్ తొలగింపు, దసరా బోనస్ లేకపోవడం, పీఎఫ్ డబ్బులు చెల్లించకపోవడం, సక్రమంగా జీతాలు చెల్లించకపోవడం వంటి ఉక్కు కార్మికుల ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీస్తున్న కేంద్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. స్టీల్ కార్మికుల ఆర్థిక ప్రయోజనాలను కాపాడాలని, ప్లాంట్‌కు అవసరమైన ముడి సరుకును సమకూర్చి, పూర్తి సామర్థ్యంతో ఉత్పత్తి జరిగేలా చూడాలని ప్లకార్డులు పట్టుకుని నినదించారు. కార్యక్రమంలో టివికె. రాజు, డివి రమణారెడ్డి, పి శ్రీనివాసరాజు, గంగాధర్ పాల్గొన్నారు.

అమృతరావుకు ఘననివాళి

ప్రజాశక్తి -ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు ప్రాణాలనే ఫణంగా పెట్టిన ఉక్కు సాధకుడు తమనంపల్లి అమృతరావు కృషి మరువలేనిదని గాజువాక మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య అన్నారు. సోమవారం ఉక్కునగరంలోని అమృతరావు పార్కులో అమృతరావు 105వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీ మిషన్ కన్వీనర్ ఎవి..రమణా రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు డి. ఆదినారాయణ, యూ .రామస్వామి, కె. పరంధామయ్య, జి. ఆనంద్, విల్లా రామ్మోహన్‌కుమార్, రాంకుమార్, బి. అప్పారావు, బూసి వెంక రావు, పట్టా రామఅప్పారావు, జెర్రిపోతుల మోహన్‌కుమార్ , కోరాడ వెంకటరావు , గాంధీ మిషన్ ఛైర్మన్ టి. మోహన్‌గాంధీ , ఎస్. మోహన్‌బాబు, సీ ప్రధాన కార్యదర్శి కెవిడి .ప్రసాద్, బయ్యే మల్లయ్య , మాటూరి శ్రీనివాసరావు, పాల్తేటి పెంటారావు పాల్గొన్నారు.



అమృతరావుకు నివాళులర్పిస్తున్న నేతలు

వంతెన నిర్మాణ బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: కితలంగి పంచాయతీ పరిశీల రోడ్డు సంపంగి గెడ్డ వద్ద వంతెన నిర్మించిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలని ఆ పంచాయతీ సర్పంచ్ ఒ.సుబ్బారావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, వంతెన నిర్మాణ పనులు ప్రారంభించి సుమారు ఏడాది గడుస్తున్నా ఇప్పటికీ బిల్లులు చెల్లించక పోవడంతో నిర్మాణ పనులు సగం వరకే జరిగాయని చెప్పారు. నిర్మాణం జరిగిన పనులకు సంబంధించి బిల్లులు చెల్లిస్తే పూర్తిస్థాయిలో వంతెన నిర్మాణం జరుగుతుందని, అధికారులు స్పందించి వెంటనే బిల్లులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఆ పంచాయతీ గిరిజనులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మెనూ అమలుపై ఆరా

ప్రజాశక్తి- పెదబయలు : స్థానిక గిరిజన రెసిడెన్షియల్ బాలుర వసతి గృహంలో ఎంపిపి బొండా వరహాలమ్మ సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. మెనూ.అమలు తీరును పరిశీలించారు. విద్యార్థులు ఎంతమంది ఉన్నారు, ఎంతెంత కేజీల కూరగాయలు ఇచ్చారు వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మంచినీరు సౌకర్యంపై ఆరా తీశారు. వంటగదిని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

సిసి రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:కొర్రా పంచాయితీ పెదపాడు పివిటిజి గ్రామంలో సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మించాలని వైసీపీ మండల నాయకుడు ఎస్‌బి బాలరాజు డిమాండ్ చేశారు. ఆ గ్రామంలో సోమవారం ఆయన సందర్శించి గ్రామస్తుల అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో వీధి కాలువలు, సిసి రోడ్లు లేక పోవడంతో వర్షాలు కురిసినప్పుడు మురుగు నీరు వీధుల్లో నిలువ ఉండిపోతుందన్నారు. దీంతో పలు రకాల వ్యాధులు వ్యాప్తి చెందుతుడటంతో గ్రామస్తులు అనారోగ్యాలకు గురవుతున్నారని చెప్పారు. పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, తక్షణమే అధికారులు స్పందించి ఆ గ్రామంలో వీధి కాలువలు నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

దేశంలో ఆర్థిక అక్షరాస్యత పెరగాలి

ఎంఎఫ్ఎఐ సిఇఒ చలసాని వెంకట్‌నాగేశ్వర్



ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : దేశంలో ఆర్థిక అక్షరాస్యత బాగా పెరగాల్సి ఉందని మ్యూచువల్ ఫండ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చలసాని వెంకట నాగేశ్వర్ అన్నారు. సెబీ ఆధ్వర్యాన మ్యూచువల్ ఫండ్స్‌పై ప్రజల్లో అవగాహన కలిగించేలా చేపడుతున్న పలు కార్యక్రమాలలో భాగంగా ఆయన విశాఖ వచ్చారు. ఈ సందర్భంగా సోమవారం ఉదయం బీచ్ రోడ్ లోని పార్క్ హోటల్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అక్టోబర్ 14 నుంచి 20వ తేదీ వరకు ప్రపంచ పెట్టుబడిదారుల మహోత్సవాలు జరుపుకుంటున్నామన్నారు.

మ్యూచువల్ ఫండ్స్ దేశంలో ప్రవేశించి 60 సంవత్సరాలు అయినప్పటికీ మిగిలిన దేశాలతో పోలిస్తే ఆశించిన రీతిలో పెట్టుబడులు పెరగలేదన్నారు. గత కొంతకాలంగా మాత్రం ప్రజల్లో అవగాహన పెరిగిందని, మరింత పెరగాల్సి ఉందన్నారు. సెబీ సూచనల దేశంలో ఏపీ సహా మూడు రాష్ట్రాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. విద్యాసంస్థలు సహా పలు వర్గాల ప్రజలను కలుసుకొని మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులపై అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. భారత ఆర్థిక వ్యవస్థలో మ్యూచువల్ ఫండ్స్ 67.9 లక్షల కోట్లు కలిగి ఉందని, 44 ఎసెట్ మేనేజ్మెంట్ సెంటర్ల ద్వారా దేశవ్యాప్తంగా ప్రజలకు ఆర్థిక సేవలు అందిస్తుందని తెలిపారు. భారతదేశంలో ఇప్పటివరకు మ్యూచువల్ ఫండ్స్ ద్వారా ఐదు కోట్ల మంది ప్రజలు స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెట్టారని వివరించారు. ప్రస్తుతం ఉన్న పెట్టుబడులలో రూ.15 వేల కోట్లు ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ స్కీమ్స్ లలో పెట్టుబడులు పెట్టగా రూ.65 వేల కోట్లు గ్రోత్ ఈక్విటీ స్కీమ్స్‌లో పెట్టుబడులు పెట్టారని తెలిపారు. రూ.7వేల కోట్లు బ్యాలెన్స్ స్కీమ్స్‌లో పెట్టుబడి పెట్టారని వివరించారు.

డిఎస్‌సి ఉచిత శిక్షణకు

దరఖాస్తు గడువు పెంపు

ప్రజాశక్తి-రంపచోడవరం : మెగా డిఎస్‌సికి సన్నద్ధమవుతున్న ఏజెన్సీలోని గిరిజన అభ్యర్థులకు ఉచిత వసతితో కూడిన శిక్షణకు అర్హులైన వారి నుండి దరఖాస్తులు స్వీకరణకు ఈ నెల 25వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బిఇడి/డిఇడి పూర్తి చేసి టెట్ పాసై, కుటుంబ వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలలోపు ఉన్న, ఆసక్తి కలిగిన గిరిజన అభ్యర్థులు జ్ఞానభూమి పోర్టల్ https://jnanabhumi. ap.gov.in లేదా https://mdfc.apcfss.in లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే రంపచోడవరం వైటిసి మేనేజర్ 7569098197 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. వసతితో కూడిన ఈ ఉచిత శిక్షణను గిరిజన అభ్యర్థులు వినియోగించుకోవాలని సూచించారు

భారీ వర్షం



వై.రామవరంలో కురిసిన వర్షం

ప్రజాశక్తి-వై.రామవరం : వై.రామవరం మండలం కేంద్రంలో సోమవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉంది. అనంతరం ఒంటిగంట సమయంలో వాతావరణంలో మార్పులు చోటుచేసుకొని పెద్ద పెద్ద ఉరుములతో కూడిన భారీ వర్షం పడింది. దీంతో వారపు సంతకు దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారు.

నేడు జివిఎంసి గాంధీవిగ్రహం వద్ద ధర్నా

ప్రజాశక్తి -ములగాడ :జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో ఈనెల 22న మంగళవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని సిఐటియు మల్కాపురం జోన్ గౌరవాధ్యక్షుడు ఆర్.లక్ష్మణమూర్తి పిలుపునిచ్చారు. సోమవారం జివిఎంసి 58, 59, 60 వార్డుల పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణమూర్తి మాట్లాడుతూ, 2018-20 వరకు జివిఎంసి కాంట్రాక్టు పారిశుధ్య కార్మికుల వేతనాల నుంచి కట్‌చేసిన రెండు శాతం ఇన్‌కం ట్యాక్స్‌ను సిఐటియు పోరాట ఫలితంగా తిరిగి కార్మికులకు చెల్లించారన్నారు. అయితే ఆయా మొత్తాలను నేరుగా కార్మికుల ఖాతాలకు కాకుండా ఎన్ఎస్ఎఫ్ గ్రూపుల ద్వారా చెల్లిస్తున్నారన్నారు. ఆయా మొత్తాలతోపాటు కార్మికుల వేతనాలను నేరుగా వారి అకౌంట్లకే జమ చేయాలన్న డిమాండ్‌తో నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జోన్ అద్యక్షులు కె.రమణ అధ్యక్షత.వహించిన సమావేశంలో కమిటీ సభ్యులు బి.రాంబాబు ,డి.రాము, సూరిబాబు, కుమార్, కృష్ణ, రైల్‌బాబు, ఆదినారాయణ తిరుపతిరావు, గంగులు లక్ష్మి, శ్యామల అప్పలకొండ పాల్గొన్నారు.

ఉపముఖ్యమంత్రికి ఘన స్వాగతం

ప్రజాశక్తి -ఆనందపురం :విజయనగరం జిల్లా గుర్ల గ్రామంలో డయేరియా బాధితులను పరామర్శించడానికి వెళ్లిన జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఆనందపురం జంక్షన్‌లో మండల జనసేన నేతలు ఘనస్వాగతం పలికారు. విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డు మార్గంలో గుర్ల వెళుతున్న పవన్‌కల్యాణ్‌కు స్వాగతించిన వారిలో జనసేన విశాఖ జిల్లా కార్యదర్శి మజ్జి శ్రీను, మండల ప్రెసిడెంట్ తమ్మిన అప్పలరాజు, ప్రధాన కార్యదర్శి మూర్తి, ఉపాధ్యక్షులు శివకృష్ణ, బాలు, గోవింద్, ప్రశాంత్, రాజు , శంకర్, సోంబాబు ఉన్నారు.